సొదుం జయరాం కథలు

# 40

# కళంకం

ఆ అమ్మాయిని ఎక్కడో చూశాను. ఎక్కడ చూశానా అని ఎంత ఆలోచించినా స్ఫురణకు రావడం లేదు. బజారులోనో బస్టాండులోనో అయితే ఆ అమ్మాయినే అడిగి తెల్సుకుని వుందును. ఆ అమ్మాయి ఉన్నదేమో పోలీసు స్టేషన్‌లో. ఆ అమ్మాయితోబాటు ఇంకా నలుగురైదుగురు అమ్మాయిలున్నారు. అంతా హెడ్ కానిస్టేబుల్ సీటు ముందు నిలబడి వున్నారు. అతను వాళ్లతో ఏదో పరాచికాలాడుతూ రిమాండు రిపోర్టు తయారు చేస్తున్నాడు. వాళ్ల నేరమేమై ఉంటుందో ఊహించడం నాకు కష్టమనిపించలేదు. ఏ బ్రోతల్ హౌస్‌లోనో, లాడ్జిలోనో దొరికి వుంటారు. ఆ బాపతు అమ్మాయిని నేను ఎక్కడ చూచి ఉంటానా అన్న ఆలోచనలో పడ్డాను. వయస్సు పైబడ్డ తర్వాత ఏదీ జ్ఞాపకం ఉండి చావడం లేదు. ఎంత స్ఫురణకు తెచ్చుకుందామన్నా సాధ్యం కావడం లేదు. మనసంతా గజిబిజి అయిపోయింది.

"ఇదిగో పెద్దాయనకు కాఫీ తీసుకురా" అన్నాడు ఎస్.ఐ ఎదురుగ్గా ఉన్న ఒక ఆడ పోలీసామె నుద్దేశించి.

"వద్దండీ. బయట ఇప్పుడే కాఫీ తాగి వస్తున్నాను" అన్నాను.

"మీకు కాఫీ కూడా ఇవ్వలేదంటే సి.ఐ.గారు కోప్పడుతారు" అని, "ఇంకా ఇక్కడే నిలబడి ఉన్నావేం. త్వరగా వెళ్లి కాఫీ తీసుకురా" అన్నాడు ఎస్.ఐ.

ఏ సంబోధనా లేకుండా ఒక ఆడకూతురితో ఎస్.ఐ. అట్లా మాట్లాడటం నాకు జుగుప్స కలిగించింది. కుర్చీ మహత్తు అలాటిదేమో! ఎదుటివారిని పాకే పురుగుల్లాగా చూస్తారు. ఆ

ఆడపోలీసామె పరుగెత్తుతున్నట్టుగా కాఫీకి బయలుదేరింది. నేను మళ్లీ ఆలోచనల సుడిగుండంలోకి జారాను. అదే.... ఆ అమ్మాయిని ఎక్కడ, ఎప్పుడు చూచానా అని.

"సి.ఐ.గారు మీకు బంధువా?" అడిగాడు ఎస్.ఐ.

"కాదు. తెలిసినాయన" అన్నాను.

"మీరు దైవదర్శనానికి కొండపైకి వెళ్లాలటగా? జీపు మాట్లాడి వుంచాను. వెంటనే దైవదర్శనం దొరుకుతుంది. సి.ఐ.గారు ఇప్పుడే ఏదో తొందరపని మీద బయటకు వెళ్లారు. ఆయన రాగానే మీరు బయలుదేరవచ్చు. నిశ్చింతగా వుండండి" అన్నాడు ఎస్.ఐ.

ఎలాగూ పనిమీద తిరుపతి వచ్చాను, పనిలో పనిగా దైవదర్శనం కూడా చేసుకుంటే సరిపోతుందని గంటక్రితం లాడ్జి నుంచి సి.ఐ. గారికి ఫోన్ చేశాను. ఆయన నన్ను ఇక్కడ కలవమని చెప్పి బయటకు వెళ్లాడు. నేను ఆ విషయమే దీర్ఘంగా ఆలోచిస్తున్నానని ఎస్.ఐ. అనుకున్నట్లుంది. నేను అక్కడున్న ఒక అమ్మాయిని గురించి ఆలోచిస్తున్నానన్నది ఆయన ఊహకందని విషయం!

హెడ్ కానిస్టేబుల్ రిమాండ్ రిపోర్టు రాస్తూ ఆ అమ్మాయి పేరు అడిగాడు.

"ఎలీషా" అంది ఆ అమ్మాయి మెల్లగా.

ఆ పేరు ఎప్పుడో, ఎక్కడో విన్నాను. ఆ కంఠస్వరం కూడా విన్నదే! ఎక్కడ?

మళ్లీ స్ఫురణకు తెచ్చుకోవడానికి ప్రయత్నించాను. సాధ్యం కాలేదు. అట్లా అని ఆ ఆలోచనలకు అంతటితో ఫుల్‌స్టాప్ పెట్టడానికి కూడా మనస్కరించలేదు.

ఉండబట్టలేక "సన్నగా, పొడుగ్గావున్న అమ్మాయిని ఒకసారి ఇట్లా పిలిపించండి" అన్నాను ఎస్.ఐ.గారితో.

"మీకు తెలుసా ఆ అమ్మాయి?"

"ఎక్కడో చూచినట్లుంది. నిర్ధారించుకుందామని" అన్నాను ఎస్.ఐ.గారితో.

"బజారు సరుకు. మీరెక్కడ చూచి ఉంటారు. మీ భ్రమ".

"నష్టమేమిటి పిలవండి" అన్నాను.

ఎస్.ఐ. ఒక బూతు మాట ప్రయోగించి ఆ అమ్మాయిని పిలిచాడు. ఆ అమ్మాయి మెల్లగా వచ్చి ఎస్.ఐ. ఎదురుగ్గా నిల్చుంది.

"ఏ వూరమ్మా నీది?" అడిగాను నేను. అప్పుడు చూచింది ఆ అమ్మాయి నావైపు తలెత్తి.

నన్ను చూడగానే ఆ అమ్మాయి షాక్ తిన్నట్లయిపోయింది.

ఆమె నోరు పెగలలేదనుకుంటాను. అలాగే మౌనంగా నిలబడిపోయింది.

"పెద్దాయన అడుగుతున్నది నిన్నేనే. పలకవేం సాయ్యమా??" ఎస్.ఐ. గర్జించాడు. ఆ అమ్మాయి ఒక క్షణంలోనే ఆ విషమ స్థితినుంచి తేరుకుంది. గొంతు పెగిల్చి, "మీ అమ్మాయి అనూరాధ బాగుందా అండీ" అంది.

ఒకో జ్ఞాపకానికి ఒకో లింకు అవసరం. "మీ అమ్మాయి అనూరాధ" అనగానే అప్పుడు స్ఫురించింది ఆ అమ్మాయి ఎవరో.

"నువ్వా అమ్మా!" అన్నాను.

ఆ అమ్మాయి నాకు సమాధానం చెప్పే స్థితిలో లేదు. కంఠదగ్గంగా శోకం పెల్లుబికినట్లుంది. పైటచెంగు నోటికడ్డం పెట్టుకొని చివుక్కున వెనక్కుతిరిగి, గబగబా హెడ్ కానిస్టేబుల్ దగ్గరికి వెళ్లి యధాస్థానంలో నిలబడింది.

ఒక్క నిమిషంపాటు పోలీసు స్టేషన్‌లో నిశ్శబ్దం అలముకొంది.

"మీకు తెలుసా ఆ అమ్మాయి?" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అన్నాడు ఎస్.ఐ.

తెలుసునన్నట్లు తలాడించాను. నిజానికి నా నోటమాట రావడం కష్టమైపోయింది.

"లక్షణంగా సంసారాలు చేసుకోరు. నీతిలేని ముండలు సులభ సంపాదన కావాలండీ" అన్నాడు ఎస్.ఐ.

"కింది నుంచీ పైదాకా అంతా సులభ సంపాదనకే అఱ్రులు చాస్తున్నారు గదండీ ఇట్లాంటి వాళ్లని మాత్రమే ఎందుకనాలిలెండి" అన్నాను.

నా కామెంట్ ఎస్.ఐ.గారికి నచ్చినట్లు లేదు. పేపరులో తలదూర్చాడు. మాటల్లోకి దించకుండా ఆయన నన్ను రక్షించాడు.

నన్ను మళ్లీ ఎలీషా జ్ఞాపకాలు ముసురుకున్నాయి.

నాలుగైదేళ్లకిందట సరిగ్గా ఇలాగే ఎలీషాని పోలీసు స్టేషన్‌లో చూశాను. ఆ సంఘటన కూడా ఇలాగే యాదృచ్ఛికంగా జరిగింది. ఆ సంఘటన ఇప్పటికీ నాకు బాగా జ్ఞాపకం.

నేను మా అమ్మాయి అనురాధను చూడటానికని హైదరాబాదుకు వెళ్లాను. ఆ రోజు నేను వెళ్లేసరికి మా అమ్మాయి దిగాలుగా కూర్చొనివుంది. మనిషి ముఖంలో ఏదో ఆందోళన! నన్ను చూడగానే,

"సరిగ్గా సమయానికి వచ్చావు నాన్నా" అంది మా అమ్మాయి అనూరాధ.

"విషయమేమిటో కాస్త వివరంగా చెప్పమ్మా" అన్నాను కాఫీ గ్లాసు పక్కనపెడుతూ.

అప్పుడు చెప్పింది మా అనురాధ ఎలీషా విషయం. వారం కిందట ఎలీషా ఆమె భర్త మా అనూరాధ పక్కింట్లో చేరారు. అతను ఉదయం బయటకువెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేవాడు. ఎలీషా ఒక్కతే ఇంట్లో వుండేది. ఆమె ఇరుగు పొరుగు వాళ్లతో కూడా మాటలు కలపడానికి ప్రయత్నించేది కాదు. ఇంట్లో దిగిన రెండో రోజున అనూరాధే కలుగజేసుకొని అడిగింది.

"ఏం చేస్తారు మీ ఆయన?"

"ఏం చెయ్యడం లేదు" అంది ఎలీషా.

"ఏం చదివారు?" అడిగింది అనూరాధ.

"బి.టెక్" ఎలీషా అంది.

"మీ పేరు?"

"ఎలీషా", భర్తపేరు అడిగితే 'ప్రభాకర్‌రెడ్డి' అన్నది. ఎలీషాది మతాంతర వివాహం కాబోలనుకున్నది.

"పెళ్లయి ఎన్ని రోజులయింది?"

ఆ అమ్మాయి కొంచెం తటపటాయించి "వారం రోజులు" అని చెప్పి ఇంట్లోకి వెళ్లిపోయింది.

ఎలీషా ధోరణి చూస్తే అనురాధకు ఏదో అనుమానం కలిగింది. ఉద్యోగం సద్యోగం లేదు. పెళ్లయిన వారం రోజులకు హైదరాబాద్‌కు ఎందుకు వచ్చినట్లు? అందునా పెద్ద దిక్కంటూ ఒకరు ఎవరూ వెంట లేకుండా? సరే మనకెందుకులెమ్మని తర్వాత అనూరాధ ఆ విషయం పట్టించుకోలేదు. మూడోరోజు ఎలీషా అనురాధ దగ్గరికొచ్చింది. ఏదో వంట పాత్రకని. మళ్లీ మాటామాటా కలిసింది. అప్పుడు ఎలీషా ఉన్నది ఉన్నట్లు చెప్పింది అనూరాధతో.

ఆ అమ్మాయి డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూండగా ఇద్దరూ ప్రేమించుకున్నారు. ఎలీషాది పేద కుంటుంబం. ఆ అబ్బాయిది మధ్య తరగతి కుటుంబం. బి.టెక్ పూర్తిచేశాడు. ఈ పెళ్లికి ఆ అబ్బాయి తల్లిదండ్రులు ఏ పరిస్థితులలోనూ అంగీకరించరని తెలుసు. ఆ అమ్మాయిని వదులుకోలేడు. చర్చిలో పెళ్లి చేసుకొని హైదరాబాద్‌కు వచ్చాడు. ఏదన్నా ఉద్యోగం దొరుకుతుందేమోనని ప్రయత్నిస్తున్నాడు.

"ఆ అబ్బాయి తల్లిదండ్రులకు ఈ విషయం తెలిస్తే ఊరుకోరేమో" అంది అనూరాధ.

"అదే నాకూ భయంగావుంది. ఆయనేమో నోట్లో నాలుకలేని మెతక మనిషి. ఏం జరుగుతుందో నాకు భయంగా వుందక్కా."

"ఇప్పుడు భయపడి ఏం లాభం? అన్నిటికీ భగవంతుడున్నాడు" అంటూ అనూరాధ ధైర్యం చెప్పింది.

ఎలీషా భయం నిజమైంది. ఆ అబ్బాయి తండ్రి ఎట్లా పసికట్టాడో ఏమో ఐదారుగురిని వెంటేసుకుని జీపులో హైదరాబాదు వచ్చి ఇల్లు కూడా కనుక్కున్నాడు. ఇంటి దగ్గరకొచ్చి పెద్ద సీన్ క్రియేట్ చేశారు. ఆ అబ్బాయిని నానా తిట్లూ తిట్టారు. ఎలీషాను కొట్టడానికి ప్రయత్నిస్తే అనూరాధ అడ్డుకొంది. ఇరుగూ పొరుగూ అంతా తోడై ఆ అమ్మాయిని కొట్టనివ్వలేదు.

"ఆ అమ్మాయిది ఏం తప్పు" అని నిలదీశారు.

"మా అబ్బాయిని వలలో వేసుకున్నది" అన్నారు.

"మీ అబ్బాయి చెవిలో పూవు పెట్టుకున్న అమాయకుడేం కాదు. బి.టెక్ చదువుకున్నవాడు. ఆ అమ్మాయి వలలో వేసుకన్నదని చెప్పడానికి మీకు బుద్ధి లేదా?" అంటూ నలుగురూ తగులుకున్నారు. ఆ అబ్బాయిని జీపులో తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తే ఆ ప్రయత్నాన్ని కూడా అడ్డుకున్నారు. ఇక లాభం లేదనుకొని వాళ్లు పోలీస్‌స్టేషన్ను ఆశ్రయించారు. నిజానికి ఇది పోలీసు కేసు కాదు. ఎందుకనో పోలీసులొచ్చి ఇద్దర్నీ స్టేషన్‌కు తీసుకుపోయారు."

"నువ్వు అర్జంటుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లనాన్నా. అక్కడ ఎలీషాకు అన్యాయం, అవమానం జరక్కుండా చూడు" అంది అనూరాధ.

"ఎంతసేపయిందమ్మా తీసుకెళ్లి" అన్నాను.

"ఇప్పుడే. రెండు గంటలముందు."

వెళ్లక తప్పేటట్లు లేదు. ఆటో తీసుకొని స్టేషనుకు వెళ్లాను. నేను వెళ్లేసరికి అంతా స్టేషన్లో వున్నారు. ఎలీషా ఒక మూల ఒదిగి నిలబడి వుంది. ఏం జరిగిందో ఏమో. ఆమె కళ్లవెంట నీళ్లు ధారకట్టి దుముకుతున్నవి. నేను ఆమె దగ్గరికి వెళ్లి భుజం తట్టాను. తలెత్తి ఆశ్చర్యంగా నావైపు చూసింది. "ఎవరు మీరు?" ఇన్‌స్పెక్టరు తారాస్థాయిలో గర్జించాడు.

నేను దగ్గరికి వెళ్లి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. కూర్చోమని కూడా చెప్పలేదు. కూర్చోమని చెప్పడం వాళ్లకు నామోషీ కుర్చీ ఇన్‌స్పెక్టరుకు ఎదురుగ్గా లాక్కొని కూర్చున్నాను.

"ఆ అమ్మాయితో ఏమిటి మీకు సంబంధం?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ తారాస్థాయి తగ్గించకుండా.

"మానవతావాద సంబంధం" అన్నాను మంద్రస్థాయిలో. ఇన్‌స్పెక్టర్ నన్ను నమిలి మింగేట్టు చూశాడు. ఒక నిముషం ఇద్దరి మధ్య మౌనం తాండవించింది.

"ఆ అబ్బాయి, అమ్మాయి చట్టరీత్యా చర్చిలో వివాహం చేసుకున్నారు. ఇందులో మీరు జోక్యం కలుగజేసుకోవలసింది ఏమీ లేదు. ఇద్దర్నీ నా వెంట తీసుకెళ్దామని వచ్చాను" అన్నాను నేను.

"ఆ అబ్బాయి నియోజక వర్గం మినిస్టరుగారు ఈకేసు ఇక్కడే పరిష్కరించమని ఫోన్ చేశారు" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

ఇదోరకం బెదిరింపు.

"నాకు కనీసం అరడజను మంది మినిస్టర్లు తెలుసు, వీళ్లను వదిలిపెట్టమని ఫోన్ చెయ్యగలరు. చేయించనా" అన్నాను.

నేను వాస్తవమే మాట్లాడుతున్నానో, బుకాయిస్తున్నానో ఆయనకు అర్థం కాలేదు. నావైపు ఒకసారి ఎగాదిగా చూశాడు. ఏమనుకున్నాడో ఏమో ఆ అమ్మాయిని, అబ్బాయి తరపు బంధువుల్ని అందరినీ బయటకు పంపాడు. నాతో చర్చలు ప్రారంభించాడు.

"ఆ అబ్బాయి కులం మీకు తెలుసు. ఈ ప్రేమ వివాహం వల్ల ఎంత కట్నం నష్టపోతాడో చెప్పండి" అన్నాడు.

"కనీసం నాలుగైదు లక్షలు నష్టపోతాడు. కాదనను, కాని ఆ అమ్మాయి జీవితం విషయం ఆలోచించారా?" అడిగాను.

"ఆలోచించాను. అబ్బాయిని విడదీయడంవల్ల ఆ అమ్మాయికి ఒక మేరకు నష్టం జరిగేమాట వాస్తవం. దానికి ఒక ఇరవైవేలు పరిహారం ఇప్పిద్దాం. ఏమంటారు?" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

అతని విలువ నాలుగైదు లక్షలు. ఆ అమ్మాయి విలువ ఇరవైవేలు!

ఆ ప్రతిపాదన నాకు నచ్చలేదు. కానీ సాధకబాధకాలు ఆలోచించాను. నేను ఆ అమ్మాయికి ఏమీ కాను. ఏదో కాకతాళీయంగా కలిసినవాడ్ని. అబ్బాయి తాలూకు వాళ్ళు అంత సులభంగా ఈ వ్యవహారాన్ని వదలరు.

నాలుగైదు లక్షల వ్యవహారం. ఈ వ్యవహారం తెగినంతవరకు ఆమెకు నేను అండగా నిలబడడం సాధ్యం అవుతుందో కాదో. ఏమిటి చేయడం?

"ఏమిటి ఆలోచిస్తున్నారు? ఇది ఇరువురికీ కూడా శ్రేయస్కరం. అమ్మాయిని ఒప్పించండి. మీకు తెలుసునో తెలియదో, వాళ్లు అప్పుడే అబ్బాయిని వాళ్ల దారిలో పెట్టుకున్నారు" అన్నాడు.

ఇక చచ్చినట్లు అంగీకరించడమే మేలనిపించింది.

"ఒక మాట ఆ అమ్మాయిని అడిగి చెబుతాను" అన్నాను.

"కావలసినంత టైం తీసుకోండి. అమ్మాయిని అడిగే చెప్పండి"

నేను ఆ అమ్మాయిని పక్కకు పిల్చి సాధక బాధకాలు వివరించాను. "డబ్బు తీసుకొని రాజీపడటం మేలమ్మా" అన్నాను.

కాసేపు ఆ అమ్మాయి మాటాపలుకూ లేకుండా కొయ్యబొమ్మలా నిలబడింది.

కాసేపటికి తేరుకొని, "ఆయన అభిప్రాయం ఏమిటో కనుక్కున్నారా?" అంది.

"లాభం లేదు. అతను వాళ్లతో కలిసిపోయాడు" అన్నాను.

ఆ అమ్మాయి ఒక నిట్టూర్పు విడిచి "ఇక ఇంటికి వెళ్దాం పదండి. నాకా డబ్బు అవసరం లేదు" అన్నది.

"హృదయానుబంధమే తెగిపోయింది. ఇక డబ్బు తీసుకోవడమెందుకు? అంతకన్నా నైచ్యమేముంటుంది చెప్పండి" అన్నది.

ఆ అమ్మాయి ఆ మాట అంటున్నపుడు ఆమె కళ్లలో ఆత్మగౌరవం తొణికిసలాడింది. డబ్బు సంగతి వింటూనే ఎగిరి గంతేసి రాజీ బేరానికి ఒప్పుకుంటుందనుకున్నాను. నా ఊహ పొరపాటని తేలిపోయింది.

ఏది ఏమైనా నామాట ప్రకారం ఈ విషయం ఇన్స్‌పెక్టర్‌తో చెప్పకతప్పదు గనుక చెప్పాను.

"తొందరేం లేదు. ఈ రోజంతా ఆలోచించుకొని చెప్పమనండి. ఆ అమ్మాయి మేలుకోరి చెపుతున్నాను. వీళ్లని అంతవరకు నా అందుబాటులో వుంచుకుంటాను. ఆ అమ్మాయికి ఒక మేరకైనా న్యాయం జరగాలి" అన్నాడు.

ఆ అమ్మాయిని తీసుకొని ఇంటికి వచ్చాను.

"ఏమ్మా ఇప్పటికైనా మించిపోయింది లేదు. తీరిగ్గా కూచొని బాగా ఆలోచించుకో. నీ చెంత డబ్బుంటే..........."

"పదే పదే ఆ ప్రస్తావన తెచ్చి నన్ను బాధపెట్టకండి" అంటూ మాట తుంచివేసింది.

మళ్లీ ఈ రోజు ఇన్నేళ్ల తర్వాత ఆ అమ్మాయిని ఈ స్థితిలో, పోలీసు స్టేషన్‌లో చూస్తున్నాను. మనసు పూర్తిగా, వికలమై పోయింది. ఆ అమ్మాయికి పాత జ్ఞాపకాలు స్ఫురణకు రావడంతో బాధపడినట్లుంది. కొద్దిసేపట్లోనే తేరుకుంది. ఆ అమ్మాయిని ఎట్లా పలకరించాలో అర్థం కావడం లేదు. దగ్గరికివెళ్లి, "బాగున్నావా అమ్మా" అన్నాను.

"బాగానే వున్నాను"

తర్వాత ఏం మాట్లాడాలో నాకు తోచటం లేదు. ఉండి ఉండి మెల్లగా అన్నాను. "ఆరోజు డబ్బు తీసుకొని రాజీపడి వుంటే నీ జీవితమిట్లా అయ్యేది కాదుగదా".

"ప్రేమకు కళంకం తేకూడదనుకున్నాను."

"కానీ జీవితానికి కళంకం తెచ్చుకున్నావు."

"నేనట్లా అనుకోవడం లేదు."

"ఎట్లా అనుకొన్నా జరిగింది అదే. జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకున్నావు. ప్రారబ్ద కర్మ ఎవరు తప్పించగలరు" అన్నాను సానుభూతిగా.

"ప్రారబ్ద కర్మ ఎందుకవుతుంది. మీలాటి పెద్దల చలవ. సమాజం చలవ" అంటూ చేతులెత్తి నమస్కారం చేసి కానిస్టేబుల్ వెంట వెళ్లిపోయింది.

నన్ను ఎవరో చెల్లున చెర్నాకోలతో కొట్టినట్లనిపించింది.

**- (1996, వార్త)**